## పెద్దమ్మ తల్లికి ఘనంగా పంచామృతాభిషేకం



పెద్దమ్మ తల్లికి పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచ రూరల్, అక్టోబర్ 13: మండలంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో అర్చకులు శుక్రవారం అమ్మవారికి పంచామమృతాభిషేకం చేశారు. ఆలయం ఎదురుగా ఉన్న అమ్మవారి జన్మస్థలం వద్ద ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన పసుపు, కుంకుమ, గాజులు, ఒడి బియ్యం సమర్పించారు. ఆలయంలోని మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకం చేశారు. పంచ హారతులు, నివేదన, నీరాజన మంత్ర పుష్పం సమర్పించారు. పంచహారతుల కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై, అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. యాగశాలలో అర్చకులు రుద్రహోమం చేశారు. దేవస్థానం ఈవో రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహీపతి రామలింగం, ధర్మకర్తలు పాల్గొన్నారు.

## రూ.3.84లక్షలు పట్టివేత

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 13: ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తున్న వారిపై మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా పోలీస్ అధికారులు వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా, ఆధారాలు లేకుండా తరలిస్తున్న మొత్తం రూ.3.84లక్షలను స్వాధీనపర్చుకున్నారు. జూలూరుపాడు పోలీసులు వినోభానగర్‌లో రూ.2.08లక్షలు, అన్నపురెడ్డిపల్లి పోలీసులు బూరుగుగూడెంలో రూ.76వేలు, ఏడూళ్ల బయ్యారం పోలీసులు రూ.లక్ష సీజ్ చేశారు.


## లైబ్రరీకి పుస్తకాలు అందజేత



పుస్తకాలు ఇస్తున్న టీవీ చలం

చర్ల, అక్టోబర్ 13: చర్లలోని శాఖా గ్రంథాలయానికి విశ్రాంత ఉపాధ్యాయుడు టీవి చలం విలువైన పుస్తకాలను శుక్రవారం అందజేశారు. వీటిని లైబ్రేరియన్ వంశీకృష్ణ అందుకున్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు అంకాల శ్రీనివాసరావు, బత్తుల వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## ఏసీ కమ్యూనిటీ హాల్‌కు తుది మెరుగులు



సిద్ధమవుతున్న గౌతంపూర్ కమ్యూనిటీ హాల్

రామవరం, అక్టోబరు 13: సింగరేణి కార్మికులు కొంతకాలంగా ఎదురుచూస్తున్న ఏసీ కమ్యూనిటీ హాల్.. నిర్మాణం ముగించుకుని, ప్రారంభానికి సిద్ధమవుతున్నది. కార్మికులు వివాహాది శుభకార్యాలను నామమాత్రపు రుసుముతో ఈ కమ్యూనిటీ హాల్లో జరుపుకోవచ్చు. టీబీజీకేఎస్ కృషితో ఇది అందుబాటులోకి రానున్నది. సింగరేణి కొత్తగూడెం ఏరియా ఏజీఎం (సివిల్) సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షణలో తుది పనులు జరుగుతున్నాయి.

# ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 13: అసెంబ్లీ ఎన్నికలను సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ శాతం పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఓటు హక్కు నమోదుకు ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకోలేని దివ్యాంగులు, వయోవృద్ధులు (80 సంవత్సరాలు పైబడిన వారు), అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వారి కోసం ఫారం 12డీ ద్వారా ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగానికి అంగీకార పత్రాన్ని తీసుకుంటున్నట్లు వెల్లడించారు. తప్పుడు, అసత్య ప్రచారాలను నియంత్రించేందుకు కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని 1,095 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని, ఐదు నియోజకవర్గాల్లో మొత్తం 9,45,094 మంది ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. వీరిలో మహిళలు 4,61,315 మంది; పురుషులు 4,83,741 మంది; ఇతరులు(ట్రాన్స్‌జెండర్) 38 మంది; ఎన్ఆర్ఐలు 43 మంది; సర్వీస్ ఓటర్లు 731 మంది; దివ్యాంగులు 14,930 మంది; యువ ఓటర్లు (18–19 సంవత్సరాలు) 22,096 మంది; వయోవృద్ధులు (80 సంవత్సరాలు పైబడిన) 13,082 మంది ఉన్నారని వివరించారు. ఎన్నికల్లో అక్రమాలకు కట్టడి చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం 2018లో సీ విజిల్ యాప్ అందుబాటులోకి తెచ్చిందని పేర్కొన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా, అక్రమాలకు పాల్పడినా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఎన్నికల నియమ నిబంధనల ఉల్లంఘన ఫిర్యాదులను ఫొటో/వీడియో ఆధారాలతో ఈ యాప్ ద్వారా పంపవచ్చని వివరించారు. యాప్‌లో ఫిర్యాదు చేసినట్లయితే ఆటో లొకేషన్ ద్వారా ఎన్నికల నిర్వహణ అధికారులు 100 నిమిషాల్లో చర్యలు చేపడతారని తెలిపారు. కంట్రోల్ రూమ్ నంబర్ 1950కు కూడా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

## ఎన్నికల నియమ నిబంధనలను
# కఠినంగా అమలు చేయాలి

### జడ్పీ సీఈవో విద్యాలత

పాల్వంచ రూరల్, అక్టోబర్ 13: ఎన్నికల నియమ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను జడ్పీ సీఈవో విద్యాలత ఆదేశించారు. మండలంలోని సూరారం, పాండురంగాపురం, పాండురంగాపురం తండా, ఇల్లెందులపాడు తండా తదితర ప్రాంతాల్లో ఆమె శుక్రవారం పర్యటించారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు వస్త్రంతో ముసుగు వేయించారు. ఆయా పార్టీ ఫ్లెక్సీలు, పోస్టర్లను సిబ్బందితో తొలగింపజేశారు. పోలింగ్ స్టేషన్లలో వసతులను పరిశీలించారు. అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఓటు వేసేందుకు వికలాంగులు కేంద్రంలోకి వచ్చేందుకు వీలుగా ర్యాంపులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో అప్పారావు, ఏపీవోలు పోరండ్ల రంగా, రామచందర్, పంచాయతీ కార్యదర్శులు ప్రభాకర్, మంగ, కాళీ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విగ్రహానికి ముసుగు కప్పుతున్న సిబ్బంది, పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

# కారులో తరలిస్తున్న నల్లబెల్లం పట్టివేత

పాల్వంచ, అక్టోబర్ 13: కారులో తరలిస్తున్న నల్ల బెల్లాన్ని పట్టణ పోలీసులు శుక్రవారం రాత్రిపట్టుకున్నారు. జాతీయ రహదారిపై లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్ వద్ద వాహనాలను పోలీసులు శుక్రవారం రాత్రి తనిఖీ చేస్తున్నారు. ఏపీ 31 ఏకే 0333 నంబరుగల తవేరా కారు ఆగకుండా వేగంగా దూసుకెళ్లింది. పోలీసులు వెంబడించడంతో గొల్లగూడెం వైపు గట్టాయిగూడెం వద్ద కారును డ్రైవర్ వదిలేసి పారిపోయాడు. అందులో నుంచి సుమారు 15 క్వింటాళ్ల నల్ల బెల్లాన్ని పట్టణ ఎస్సై బాణాల రాము స్వాధీనపర్చుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కారు నుంచి నల్ల బెల్లం స్వాధీనపర్చుకుంటున్న ఎస్సై రాము

# బతుకమ్మ సంబురాలు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబర్ 13: స్థానిక సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ సంబురాలను శుక్రవారం నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి ఆడిపాడారు. ప్రిన్సిపాల్ చింతా శారద, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబర్ 13: స్థానిక మేదరబస్తీలోని శ్రీరాగా ప్లే స్కూల్, హైస్కూల్‌లో బతుకమ్మ సంబురాలు జరిగాయి. పాఠశాల యాజమాన్యం ప్రతినిధులు మల్లారపు వరప్రసాద్, కవిత, ఉపాధ్యాయులు రాంబాబు, సంధ్య, యాస్మిన్, మాధవి, సుహాసిని, శ్రీలత, పూజిత, సంధ్య, రాణి, అరుణ, నాగమణి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ, అక్టోబర్ 13: ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్(పీఆరీయూ) ఆధ్వర్యంలో మహిళలు సీతారాంపట్నం పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. జిల్లా అధ్యక్షుడు డి. వెంకటేశ్వరరావు, నాయకులు జ్యోతి, మాధవి, మహాలక్ష్మి, శ్రీదేవి, పద్మ, కృష్ణవేణి, షీలారాణి, రేణుక, హైమావతి, వసంత, సక్కుబాయి, దుర్గారాణి, రవి, సంగమేశ్వరరావు, కిరణ్, పూర్ణ, వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ రూరల్, అక్టోబర్ 1: మండలంలోని లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ సంబురాలను ఉపాధ్యాయినులు, విద్యార్థినులు నిర్వహించారు. ప్రిన్సిపాల్ శంకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రవీంద్రబాబు, అధ్యాపకులు సంపత్, స్వరూప, గోపాలకృష్ణ పాల్గొన్నారు.



బతుకమ్మతో చిన్నారి

# బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..



ఎడ్యుకేషన్: సింగరేణి మహిళా కళాశాల వేడులో అధ్యాపకులు, విద్యార్థినులు



పాల్వంచ రూరల్: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో..